# చెదిరిన గుండెలు

"బియ్యం అయిపోవచ్చినాయి. యీపొద్దేమొస్తాయో. యేమో. బియ్యం తేవాల" సుభద్ర హెచ్చరించింది.

భార్య సుభద్ర. యింట్లో బియ్యం సమస్యను లేవనెత్తిన శుభ తరుణంలో వెంకటరత్నం వొక భావి భారత పౌరుని ఆంధ్రభాషా పాండిత్యాన్ని, జవాబు పత్రంలోని ఆహార సమస్యనుబట్టి బేరీజు వేస్తున్నాడు. విద్యార్థులు పరీక్షల్లోరాపిన కాగితాలమీద ఆహారసమస్యను సులభంగా పరిష్కరించవచ్చు. కానీ, నెలలో మూడవ వారమైనా తిరక్కముందే యింట్లో పరిష్కరించడం వెంకటరత్నం లాంటి వాడికి అంత సులభంకాదు. వెంకటరత్నం పేపర్లు దిద్దడం మాని, ఆలోచనలోపడి అస్పష్టంగా గొణిగాడు:

"అప్పుడే అయిపోయినాయా?"

"అంటే నేనేమన్నా అమ్ముకున్నానా? నాకేమన్నా దయ్యం పట్టి యింట్లో పోసిన బియ్యం రాసులు తిన్నానా? లేకుంటే మావాళ్లే మయినా మీ యింటిమీద పడి తిన్నారా? మాటి మాటికి వచ్చే మీ చుట్టాలే తిన్నారు. పోయిన్నెల్లో తెచ్చిన బియ్యం మూటను సగం

పైగా వాళ్లే తిన్నారు. ఆ మిగిల్నేటివేగా మనం తినింది. మన మొగా నికి రెండుపూట్లా ఆ బియ్యం తప్ప తినడానికి యేమన్నా వుంటేకదా అయిపోంది? అయిపోక యేంజేస్తాయి?'' సుభద్ర ఆగ్రహించింది.

ముఖ్యంగా యిటువంటి సందర్భాల్లో తనలాంటి నడిమి తర గతి వాడెవడూ సుభద్రలాంటి భార్యల్ని కదిలించ కూడదనుకొన్నాడు వెంకటరత్నం. బురద చేసుకొన్నాక కడుక్కోక తప్పదు. వెంకట రత్నం సరసంగా నవ్వుతూ అన్నాడు:

''అంత మాట లెందుకు? నేనేం నీకు రోజూ రేషనివ్వడం లేదుగా! యెవరన్నా తిన్నీ. అప్పుడే, యిరవై రోజులకే మూట బియ్యం అయిపోయినాయా అన్నా. నాకు మాత్రం మనింట్లో బియ్యం ఖర్చు తెలీదా? రాణిగారికి అప్పుడే అంతకోపమైతే యెట్లా?''

మాటల యుద్ధం నుంచి రేగే బాధను తప్పించుకోవడానికి తరచుగా వెంకటరత్నం వుపయోగించే సరసత బెడిసికొట్టింది.

''సరసాలకు మాత్రం కొదువలేదు. కట్టుకున్నదాన్ని సుఖ పెట్టే రాత లేదుగానీ'' సుభద్ర విసుగ్గా అంది; బాధగా, కోపంగా, అసహ్యంగా అంది.

భర్త సరసాన్ని సరసంగా తీసుకొనే రసజ్ఞతను సుభద్ర కాపురానికి వచ్చిన కొత్తలోనే కోల్పోయింది. ఆమె దెబ్బ కొట్టవల సినచోట కొట్టి, వంటింట్లోకి దూరింది. వెంకటరత్నం వెంబడించి అనునయిద్దామనుకొన్నాడు. కానీ సుభద్ర వడ్డించిన వొకటి రెండు మాటలతోనే కడుపు నిండి పోయింది. మాటలతో చిత్రవధచేసే శక్తి

సుభద్రకుంది. యెంత చిన్న మాటకైనా గాయపడే హద్దులు మించిన అనుభూతి తీవ్రత వెంకటరత్నానికుంది. అయితే సుభద్ర గయ్యాళి కాదు. భర్తను రాచి రంపాన పెట్టడమే ఆమె జీవిత పరమావధికాదు. సంసారం నడపడంలో భర్త నిస్సహాయత్వం అనుభవానికి వచ్చినప్పుడల్లా సుభద్రకు జుగుప్స. ట్యూషన్లకూ, మార్కులు వేయడానికి కూడా పనికిరాని వెంకటరత్నం పనికిమాలిన తెలుగు పాండిత్యం మీద పగ. యే వికాసమూలేని మొండిబ్రతుకు పట్ల ద్వేషం. అందుకే సుభద్ర హృదయంలో రేచులు; అందుకే సుభద్ర నాలుకపై త్రాచులు; అందుకే సుభద్ర మాటల్లో కారం రాచిన ఈటెలు; కాలం యిచ్చిన కత్తులు.

వంటింట్లో మండుతున్న పొయిలోనికి కట్టెలెగదోస్తున్న సుభద్ర హృదయం భగభగ మండుతోంది; పోయిలోని కట్టెల్లా కాలుతోంది.

తానేమీ స్వర్గసౌఖ్యాలు కోరుకోలేదు. తనకేమీ యిప్పటికి మేడలక్కర్లేదు; మిద్దెలక్కర్లేదు; కార్లక్కర్లేదు; పదిమంది నౌకర్లూ, చాకర్లూ అక్కర్లేదు. తాను కోరుకుందల్లా రెండుపూట్ల కాస్త నోటికి నసి అయిన భోజనం - రెండు మూడు కూరల్తో, నెయ్యితో, పెరుగుతో. రోజుకు రెండే రెండు పూట్ల టిఫిను, వారానికి రెండు మార్లయినా మాంసమో, గుడ్లో, పదో పన్నెండో చీరలు-ఆఫ్‌వాయిల్‌వే కాని, వొకటో రెండో నగలు-ముచ్చటగా. పెండ్లిలో పుట్టింటివాళ్లు పెట్టిన పది తులాలకూ వొంటిపుర్రి గొలుసు మిగిలింది. వారానికి వొక్క సినిమా, పిల్లలకు పాలూ, పండ్లూ-రేడియోలో చెప్పినట్లు. యింట్లో చాకిరికి వొక్క పని మనిషి - వొకే వొక్క పని మనిషి.

యీ గొడ్డు చాకిరి చెయ్యలేక దుంప తెగుతోంది. కనీసం పక్కింటి పిడబ్ల్యూడి సూపరువైజరు భార్య అనుభవించే కొన్నే కొన్ని సుఖాలు. పెళ్లి చేసుకున్నవాడు సుఖపెట్టలేకపోతే యింకెవరు సుఖపెట్టేటట్లు? సుఖపెట్టలేనివాళ్లు తగుదునమ్మా అని పెండ్లెందుకు చేసుకోవాలో? అయినా అందరి మొగుళ్లూ యిట్లాగే వుంటారా? తన ఖర్మగానీ. తనకు సుఖపడే రాతలేదు.

సంపాదనాపరుడైన వేరొకమొగుణ్ని వెంకటరత్నం స్థానంలో వూహించుకొని. అట్లాంటి వూహ కలిగినందుకు సుభద్ర నొచ్చుకుంది.

ఆయన్నని యేంలాభం? ఆయన మంచోడే. వుద్యోగం అట్లాంటిది. నొసటిరాత. కాలం చెడ్డది.

సుభద్ర హృదయం వేదనతో బరువెక్కింది.

వెంకటరత్నం గదిలో కుళ్ళుకుంటున్నాడు.

నిజమే! భార్యను సుఖపెట్టే రాత తనకు లేదు. సుఖపెట్టమని అడిగే అధికారమైనా ఆమెకుంది - భార్య కాబట్టి. తను భరించాలి కాబట్టి. తన్ను సుఖపెట్టమని తానెవ్వర్నడగాలి? సుభద్ర తన్ను కట్టుకొని పొందుతున్న దేమిటి! డబ్బుతో యివ్వగలిగిన యే సౌఖ్యాలను తాను సుభద్ర కివ్వగలిగాడు? యిచ్చిన సుఖమల్లా శారీరక సుఖం — డబ్బు ఖర్చులేకుండా యివ్వగలిగింది. మరింకేమిచ్చాడు? నలుగురు పిల్లల్ని. ఆపరేషన్ చేయించుకోక పోయుంటే మరో యిద్దరైనా భూమ్మీదికి వచ్చివుండేవాళ్ళు—తల్లి కడుపు చీలుస్తూ. తనకు మరికొన్ని సమస్యలను సృష్టిస్తూ. అయినా సుభద్రను కట్టుకొని తాను మాత్రం అనుభవించేదేమిటి? యే వుద్యోగం చేసేదాన్నో కట్టుకొని

వుంటే యిన్ని బాధలుండకపోను. వేణీళ్ళకు చన్నీళ్లతోడయ్యేవి. పాత బంధుత్వమూ, ఆ సమయానికి త్వరలో కలుగబోయే తియ్యటి సుఖం కోసం వురకలేస్తున్న నెత్తురూ కళ్ళకు పొరలు కప్పించి, యీ వూబిలో దించాయి. కాస్త ఆగివుంటే వుద్యోగం చేసే ఆడది దొరికివుండేది. యిప్పుడు మాత్రమేం? సుభద్ర చస్తే చేసుకోవచ్చు. నలుగురు పిల్లల తండ్రికెవడిస్తాడు? యెవడో వొకడు తలమాసినవాడు. చదువుకొని వుద్యోగంచేసే యే ఆడది తనను కట్టుకుంటుంది - అందులో రెండో పెళ్లయితే. యెవతో వొకతె తలమాసింది. సుభద్రకూ యిలాంటి ఆలోచనలొస్తే! ఛీ! యెంత నీచమైంది మనసు. దరిద్రుడికి నానాకచింత. వెంకటరత్నానికి తనమీద తనకు రోతకలిగింది.

యీ పది పన్నెండేళ్ళ జీవితంలో తానను భవించిందేమిటి- యీ బడిపంతులుద్యోగంలో? పేరుకు గ్రేడ్ వాన్ తెలుగు పండిట్- బహుళార్థసాధక పాఠశాలలో. కాకపోతే సంసార జీవితం ప్రపంచానుభవాన్నిచ్చింది. తనకంటే హీనమైనవాళ్లు తనచుట్టూ చాలామంది వున్నారనే జ్ఞానాన్నిచ్చింది. నయం! సుభద్రావాళ్ళను తను మాడ్చడంలేదు — తిండిపెట్టక. తిండంటూ వుంది-విందు భోజనాలు కాకపోయినా. యింకా నయం! బట్టలంటూ వున్నాయి - చీనిచీనాంబరాలు కాకపోయినా. యిల్లంటూ వుంది - బాడుగదే. యెలుకల బోనైనా. యేం తిండో! యేం బట్టలో! యేం యిల్లో! ఆలోచించే కొద్దీ మనసు మనసు చెదిరిపోతుంది. యీ బాధంతా యింట్లో బియ్యం అయిపోవడంతో మొదలైంది.

వెంకటరత్నం మనసు స్వకరుణతో నిండిపోయింది.

వంటింట్లోంచి మసిబట్టిన చేతుల్తో. పొగలో యెర్రనైన కళ్ళతో. కార్డు వొకటి తెచ్చిస్తూ సుభద్ర అంది:

"నిన్న యీ జాబొచ్చింది. యివ్వడం మర్చిపోయా. యీ గొలుసురాత నాకర్థంకాలా. అయినా యేముందీ? మల్లా యెవరో వొకరు దిగుతారు. పెద్దాసుపత్రిలో చూపించుకోడానికో. కోర్టులో యే కేసుకో వస్తున్నట్లు రాళుంటారు."

వెంకటరత్నం మౌనంగా వుత్తరం అందుకొని చదివాడు.

సుభద్ర చెప్పింది నిజమే. పెదనాయనకు బాగులేదట. పెద్దాసుపత్రిలో పెద్దడాక్టరుకు చూపించుకోడానికి వస్తున్నాడట!

వెంకటరత్నం గుండెల్లో పెద్ద రాయి పడింది.

అయనకూడ బియ్యం తింటాడు. ఆయన వెంట వచ్చే పెద్దమ్మో యెవరో వొకరుకూడా బియ్యం తింటారు. పైగా సేవలు. యీ సంగతిని యీ సందర్భంలో సుభద్రకు చెపితే ములుకుల్లాంటి మాటలు వినవలసి వస్తుంది. అంపశయ్యేమేలు.

సుభద్ర అడిగింది:

"యెవ్రరాసినారు?"

"యెవడో స్నేహితుడు" అబద్ధాన్నికూడా అలవోకగా చెప్పలేని వెంకటరత్నం నంగిగా సమాధానం చెప్పాడు. వుత్తరంలోని గొలుసక్షరాల్ని కూడబలుక్కొని చదివుంటుందేమోనని వెంకటరత్నం భయం.

"యీ యిల్లొక సత్రమైంది" సుభద్ర బాధతో అంది.

"వుండు బజారుకుపోయి బియ్యం అడిగి వస్తా." వెంకట రత్నం మాట మార్చాడు. సుభద్ర మెత్తబడింది.

"బియ్యంతోపాటు కొన్ని సరుకులు కావాల. తిలకం కూడా అయిపోయింది."

"ముందు బియ్యం అడిగివస్తా. సరుకులు రేపు తెస్తాలే. తిలకం వచ్చేటప్పుడు తెస్తా."

సుభద్ర మరేం లిస్టు సమర్పిస్తుందో, మరేం చర్చిస్తుందోనని భయపడి వెంకటరత్నం బయటికి నడిచాడు. యింటికన్నా వీధి మేలు.

వెంకటరత్నం మనసంతా ముళ్ళపొదలా వుంది. ముళ్ళ కంపలా వుంది.

యింట్లో భార్యాపిల్లలూ, వీధిలో అధికారులూ, అప్పిచ్చిన వాళ్ళ బాధలూ చాలక యీ బంధువుల హింస వొకటి. స్వంతూరికి దగ్గర్లో వుండే జిల్లాకేంద్రంలో అణాకానీ వుద్యోగం చెయ్యడమంత బుద్ధితక్కువ యేదీలేదు. పార్టీలవాళ్ళూ, రోగాలవాళ్ళూ, ఆఫీసుల్లో పనులవాళ్ళూ, కాలేజీల్లో సీట్లవాళ్ళూ అందరూ మీద పడతారు. అర్ధ రాత్రి కూడా తలుపు తడతారు-పెండ్లాం పక్కలో వున్నా తలుపు తడతారు. దస్తక్, దస్తక్. కొందరికి కాఫీలు పొయ్యాల, కొందరి కైనా భోజనం పెట్టాల. అందుకు బియ్యంకావాల. వచ్చినవాళ్ళందరికీ పక్కలు వేయాల-తమకు పరుచుకోడానికీ, కప్పుకోడానికీ లేకపో యినా. రకరకాల సేవలు - వచ్చినవాళ్ళతో ఆఫీసులవెంట తిరిగి, ఆస్పత్రులవెంట తిరిగి, అడ్డమైన గాడిదలవెంట తిరిగి,

రకరకాల సేవలు. ప్రజాసేవలో యిదీ వొక భాగమేనేమో! అవును వాళ్ళనని యేం లాభం! వాళ్ళేం తినడానికే వస్తున్నారా? దగ్గరైన వాడున్నాడని వస్తున్నారు. దగ్గరవాళ్ళను. దగ్గర చాలినంత డబ్బులేని వాళ్ళను నరకయాతన పెట్టడానికి వస్తున్నారు. తాను భరిస్తున్నాడు. వాళ్ళొస్తున్నారు, తాను భరిస్తున్నాడు. కుటుంబ గౌరవంకోసం భరిస్తున్నాడు. తానేమీ వాళ్ళమీద ప్రేమ వొలకబోసి పిలిచి పీటవెయ్యడం లేదు. సుభద్రే బంధువులు యెదురుగా వున్నప్పుడు మర్యాదలు చూపుతూ భరిస్తోంది. అప్పులైనా, యింట్లోవాళ్ళకు యిబ్బందయినా బంధు మర్యాదలు చూపాలి. అతిథి దేవోభవ! బంధు దేవోభవ! అయినా బంధువులసలే రాకపోయినా యీ జీతంరాళ్ళతో స్వర్గం చూస్తాడా? టవునుమధ్యతరగతిగాళ్ళ జీవితాల్లో యేదోరూపంలో, యేదో నెపంలో చిక్కులు తప్పవు. చీకాకులు తప్పవు. డబ్బుల యిబ్బంధులు తప్పవు. బ్రతుకు భయాలు తప్పవు. తీగ కదిపితే ముళ్ళపొద చుట్టుకుంటుంది. ముళ్ళ కంప బాధిస్తుంది.

వెంకటరత్నం బజార్లోకి వచ్చాడు.

బజార్లో షాపులు, గుడ్డల షాపులు, బ్రాందీ షాపులు, మందుల షాపులు, భోగంవాళ్ళలా కవ్విస్తున్న గుడ్డల షాపులు, వాళ్ళ చూపుల్లా మత్తెక్కిస్తున్న బ్రాందీ షాపులు, వాళ్ళ రోగాల్లా భయపెడుతున్న మందులషాపులు, కొట్లు, కిరాణాకొట్లు, కల్తీ బ్రతుకుల్లా కిరాణాకొట్లు, బజార్లో జనం గుంపులు గుంపులు. మొగవాళ్లూ, ఆడవాళ్లూ, వయసులో వున్నవాళ్లూ. లేనివాళ్లూ. డబ్బు ముఖాలు, డబ్బులేని జబ్బు మొగాలు, ఆవిడెంత అందంగా వుంది? ఆవిడ పక్కావిడ నెక్లెసు

యెంత గొప్పగా వుంది? డబ్బుంటే అన్నీ గొప్పగా వుంటాయి. ఆ స్టూడెంటు యెంత స్టయిలుగా వున్నాడు? వుండకేం పెద్దవాళ్ళు చచ్చీ చెడీ డబ్బుపంపితే. యీ స్టయిలెంత కాలంలే. మూ(డ్రో)జులు. ఆ డిగ్రీ తీసుకొని బజార్లో పడనీ! పులిబోను జీవితంలో పడనీ! వాక్క నెల బియ్యం ఖర్చుకు తట్టుకోనీ తెలుస్తుంది. ఆ ముసలోడి ముఖంలో దరిద్రదేవత. రిటయిర్డు యెలిమెంటరీ స్కూలయ్యవార్లై వుంటాడు. డెబ్బయేండ్లు నిండినా. రిటయిరైనాక పుట్టిన పిల్లకోసమో. పెళ్ళి కావాల్సిన కూతుర్ల కోసమో ట్యూషన్లు చెపుతుంటాడు. తాను అట్లాగే అవుతాడు.

వెంకటరత్నం భయంతో కంపించిపోయాడు.

బజారంతా గంగమ్మ జాతరలా వుంది. షాపులూ, కొట్లూ గంగమ్మ అలంకారాల్లాగున్నాయి. మనుషులంతా గంగమ్మకు బలి అయ్యే దున్నపోతుల్లాగున్నారు. మేకపోతుల్లా. మేకల్లా వున్నారు. పొట్టేళ్ళలా. గొర్రెల్లా వున్నారు. కోడిపుంజులూ. కోడిపెట్టల్లా వున్నారు. వాటిల్లో కొన్ని దేవరివి. బలిసినవి. కొన్ని బక్కవీ బడుగువీ. మరికొన్ని రోగిష్టివి. రకరకాలవి. జాతర. బజారొక జాతర.

వెంకటరత్నం తనకు ఖాతావుండే కిరాణాకొట్టుదగ్గరకు చేరుకున్నాడు. రద్దీగా వుంది. గల్లాపెట్టెల్లో డబ్బులమోత. బయటిఖాతాల పుస్తకంలో బరబర గీతలరాత. వ్యాపారబ్రహ్మరాత. అంగడికి వచ్చిన మనుషుల ఖరీదునుబట్టి దుకాణాదారుడు లక్ష్మిశెట్టి మర్యాదను పంచుతున్నాడు. రద్దీ తగ్గింది. వెంకటరత్నానికి అదును దొరికింది.

బియ్యం అప్పు యిస్తాడో లేదో అనుమానం పీకుతూనేవుంది. ధైర్యం చేసి "లక్ష్మిశెట్టీ! బియ్యం కావాల" అన్నాడు. లక్ష్మిశెట్టికి వెంకట రత్నం మాటలు విన్పించాయి కానీ విననట్లు పొట్లాలు కడుతున్నాడు. వెంకటరత్నం ముద్దాయిలా సంజాయిషీ చెప్పాడు:

"పొయిన్నెల్లో బాకీ పూర్తిగా యివ్వలా. వీల్లేని యిబ్బందులు వచ్చిపన్నాయి. యేమీ అనుకోవద్దు. యీనెల తప్పకుండా తీరుస్తా."

లక్ష్మిశెట్టికి మాట వచ్చింది:

"చూడు వెంకటరత్నం! బాకీలిట్లా నిలిచిపోతే నా గతేంగాను? కార్పొరేషన్లనుంచీ యెంతెంత డబ్బు వడ్డీలకుతెచ్చి యీ అంగడి మీద పెట్టినానో నీకేం తెలుసు? నీకేం మారాజువు. నెలాఖరు జీతం గ్యారంటీ వుంది. యేది బొందు పోయినా జీతం బొందు పోదుగదా! మాదేం సంపాదన? మాకెన్ని కష్టాలు? యీ గవర్నమెంటు అవక తవకల్లో రేట్ల నిలకడ వుండదు. దానికితోడు మా మానాన మమ్మల్ని బతకనివ్వరు. మాదేం బతుకు? మా కెంతమంది మొగుళ్ళు? మే మెందర్ని మేపాల! యెంత పోటీకి నిలబడాల-బజార్లో! యింతా చేస్తే చవుకడిపోలూ. కోఆపరేటివు స్టోర్లూ మా ప్రాణానికి. యీ గవర్నమెంటు పాలసీలకు తలాతోకా వుండదు'' లక్ష్మిశెట్టి వ్యాపార రాజకీయాలు మొదలు పెట్టాడు.

యీ అంగడీ, అంగడి వెనకేసిన డబ్బూ ఆ డబ్బు పెట్టిన పిల్లలూ తనకిచ్చి తన వుద్యోగం లక్ష్మిశెట్టి తీసుకోమను అంత జెపుతున్నాడు; తెలుస్తుంది. యేం మనుషులో యేడుస్తూ రవికముళ్ళు విప్పుతారు-అసహ్యించు కొన్నాడు మనసులో వెంకటరత్నం.

కథా నిలయం
991

లక్ష్మిశెట్టి లాంటివాళ్ళు యెంత కష్టపడుతున్నదీ, యెంత నష్టపడుతున్నదీ అర్థం చేసుకోలేనంతటి అమాయకుడుకాదు వెంకటరత్నం. కానీ వెంకటరత్నానికి అర్థం కానిదల్లా పడుగుపేకల్లా అల్లుకపోయిన న్యాయాన్యాయాల మాయ. జీవాత్మ పరమాత్మల సంయోగంలా నీతి అవినీతుల అద్వైతం. అయితే లక్ష్మిశెట్టి లాంటి వాళ్ళతో వాదనకు దిగే శక్తిని వెంకటరత్నం యేనాడో త్యాగంచేశాడు. యేదో రకంగా చేయికిందైన వానికెప్పుడూ సొంత అభిప్రాయా లుండవు.

"మీబాధలూ, యిబ్బందులూ నాకు తెలియవా? కానీ వీల్లేక పోయింది. వచ్చేనెల తప్పక తీరుస్తాను." వెంకటరత్నం అభ్యర్థించాడు.

"సర్లే దాందేముంది. మనుషులు ముఖ్యంకానీ ఈ డబ్బు శాశ్వతమా? చూడు వెంకటరత్నం! నువ్వేమీ అనుకోకపోతే, వచ్చే నెల యివ్వలేకపోతే వడ్డి – రూపాయొడ్డి మాత్రం వేసుకోవాల్సి వుంటుంది."

లక్ష్మిశెట్టి వ్యాపారదక్షత అనే సాలెగూటిని విస్తరించాడు. వెంకటరత్నానికి, వాళ్ళపల్లెల్లో జాయింటుదే అయినా, మెట్టే అయినా భూమనేది వుందని లక్ష్మిశెట్టికి తెలుసు. తన డబ్బెక్కడికీ పోదనీ తెలుసు. వెంకటరత్నం బలహీనతా తెలుసు.

"సర్లే యెప్పుడన్నా కాదన్నానా?" వెంకటరత్నం మూలిగాడు.

"చూడు వెంకటరత్నం! బియ్యంరేటు కొంత పెరిగింది, కొత్త సరుకు. పాత బియ్యమే, యే వాన్– మెరిసిపోతున్నాయి – కిలో రూపాయి నలభై పైసలు నడుస్తోంది. స్టోర్లలో యిస్తారే ఆ నాసిరకం

చవుక బియ్యం మనుషులు తింటారా? కిలో రూపాయ బియ్యం తింటే డాక్టర్లకోసం పరుగెత్తాల. వొక అర్ధరూపాయి పోయినా మంచి సరుకు తీసుకోవాల. యేమంటావు?" లక్ష్మిశెట్టి యేవొన్ మాటలకు వెంకటరత్నం యేమీ అనలేదు.

"వొరే గఫార్! వెంకటరత్నానికి ఆ యేవొన్ సాంపిలు పట్రా. చూస్తాడు'' లక్ష్మిశెట్టి కేక వేశాడు.

"యెందుకు? నమ్మకం లేకపోతేకదా" వెంకటరత్నం సంస్కారం మూలిగింది.

"అదీ! వ్యాపారంలో నమ్మకం ముఖ్యం. యెన్ని కావాల? వొక మూట తీసుకపో. డెబ్బయి కిలోలే కదా. నీకవి తొంభైయేడు వేసుకుంటా. సంచితో తొంబై యెనిమిది. సంచక్కర్లేకపోతే మళ్లా తెచ్చివ్వు. యిప్పట్లో యిల్లాంటి సరుకు రాదు. మూట తీసుకపో." లక్ష్మిశెట్టి ఆదరించాడు.

వొక మూట బియ్యం అప్పు దొరుకుతోంది. ఫరావాలేదు. అప్పిచ్చే వాడుంటే చచ్చినోడుకూడా లేచొస్తాడు.

వెంకటరత్నం మనసులో గండం గడచిన తృప్తి; వచ్చేనెల బడ్జెట్టూ. తీర్చాల్సినఅప్పులూ. వాటిని సర్దడానికి దొరకగల అప్పులూ గజిబిజిగా వున్నాయి.

''గఫార్! రిక్షాను పిలిచి ఆ మూటను యెత్తించు'' లక్ష్మిశెట్టి ఆదేశించాడు.

రేపో మాపో సరుకులుకూడా కొన్ని తీసుకోడానికి లక్ష్మిశెట్టిని వొప్పించుకొని బియ్యమూ. తిలకమూ తీసుకొని వెంకటరత్నం యిల్లు చేరాడు.

సుభద్ర అంది:

"బియ్యం మంచివేనా? పోయిన్నెల్లో తెచ్చిన బియ్యం మూటలో సగం రాళ్లూ, సగం నూకలూ. చేసుకోలేక చచ్చినా. సరుకులు ఆ అంగట్లో తేవద్దంటే మానరు."

వెంకటరత్నం పలకలేదు. ఆ అంగట్లో సరుకులు తేవడం మానుకొంటే వున్నట్టుండి యెదురయ్యే యిట్లాంటి యిబ్బందులు యెవరు తీరుస్తాడు అనుకున్నాడు వెంకటరత్నం.

సుభద్ర మూట కట్టు విప్పి బియ్యం తీసుకొని, అరచేతిలో వేసుకొని, వొకటి రెండు నోట్లో వేసుకొని అడిగింది:

"పాత బియ్యమే. కిలో యెంత?"

"రూపాయి నలభై పైసలు."

భర్త అమాయకత్వానికీ, అప్రయోజకత్వానికీ మరొక్క వుదాహరణ సుభద్రకు లభించింది. బియ్యం మరి గుప్పెడు తీసుకొని పరిశీలనగా చూస్తూ అంది:

"అయ్యో రాత. దేశమంతా కిలో రూపాయయితే రూపాయి నలభై పైసలు పెట్టి తేవడమా-యెంత అప్పయితేమాత్రం? యివేం ఢిల్లీభోగాలా? యివి డిపో బియ్యంలాగే వున్నాయి; కాకపోతే వొకటి రెండు సేర్లు వేరే బియ్యం కలిపినట్లుంది. నిన్న పక్కింటి పని మనిషి డిపో బియ్యాన్ని తెచ్చి చూపింది. వాళ్లింట్లో పిల్లా జెల్లా పోయి పది కిలోలు తెచ్చుకున్నారట. కిలో రూపాయిరవై పైసల కిస్తానంది. "ఆ యిరవై పైసలూ కూలి గిట్టుబాటమ్మగారూ" అంది. డబ్బు

ల్లేక కొన్లేదు. నా దగ్గర నెలకు వొక్క పది రూపాయలైనా వుంచు కోమని యిస్తేగా. అప్పని అడ్డమైనవీ నోరుమెదపకుండా తెస్తారు."

యే భార్యా తనభర్త ప్రయోజకుడనుకోదు అని అనుకున్నాడు వెంకటరత్నం. లక్ష్మిశెట్టి మోసం వెంకటరత్నాన్ని బాధించింది. లక్ష్మిశెట్టిమీద విపరీతమైన కోపం వొచ్చింది.

కల్తీ వెధవ! యే కూలీలనుంచో, రిక్షావాళ్ళ పెళ్ళాలనుంచో, డిపో మేనేజరు నుంచో చౌక బియ్యాన్ని సంపాయించి కల్తీచేసి రూపాయ బియ్యాన్ని రూపాయ నలబై పైసలకు తగలగట్టాడు. వ్యాపారస్తుడు నమ్మిన వాన్నికాక నమ్మనివాన్ని మోసం చేస్తాడా? నమ్మక మార్గాంతరం యేముందీ? అంగళ్ళలో తనవంటి వాడికి ఖాతాలు తప్పవు. ఖాతాల్నుంచి విముక్తి కావడం అసాధ్యం. అందుకే యీ మోసాలు తప్పవు. తాను పైమెట్టువాడు కాదు-పచ్చనోట్లో, నల్లనోట్లో విసిరి తనకిష్టం వచ్చినప్పుడు, యిష్టమైన వస్తువులు యిష్టమైనచోట కొనడానికి, తాను కింది మెట్టువాడుకాదు-దినకూలీతో చాలా వస్తువులు కొనను అవసరం లేకపోవడానికి. తనది నెలకూలి, యేదో అంతస్తుందనుకొనే నెల కూలి. నడిమెట్టు నెలకూలి.

వెంకటరత్నం మనసు పాడైపోయింది.

సమాధానం చెప్పకుండా ఆలోచనల్లోకి జారుకునే భర్తనుచూచి సుభద్ర విసుక్కుంది:

"యేదన్నా అడిగితే సమాధానం చెప్తే కదా! యీ బియ్యాన్ని వాడి మొఖానే తగలెయ్యి. వాడి దగ్గర మొగమాటమేమిటి? ఆ డిపో

బియ్యమే కొనుక్కుందాం. యిన్నేళ్ళు సంసారంచేసి యీమాత్రం తెలియకుంటే యెట్లా?''

వెంకటరత్నంలో లావా కరిగింది:

"చూడు సుభద్రా! నన్ను మాటిమాటిమాటికీ విసిగించవద్దు. నామీద యిట్లా విరుచుక పడవద్దు. సంసారంకోసం నేను పడే బాధలు పడుతున్నా. మోసమూ పడుతున్నా. యిదంతా నా చేతగాని తనమే అనుకో. మునిగిపోయిందేమీ లేదు. దేశంలో నాలాంటివాళ్ళు సవా లక్షమందున్నారు. నాలాంటివాళ్ళు-కాదు _ మనలాంటి వాళ్ళందరినీ విశ్వామిత్రుడు సృష్టించినట్లుంది. వాడొక భ్రష్టయోగి. మనమొక భ్రష్టవర్గం. త్రిశంకుడి వారసులం. మన బాధ లిప్పటికింతే. యిట్లా కుళ్లుకుంటూ చావాల్సిందే. నువ్వు గొంతు చించుకొనీ ప్రయోజనం లేదు. నేను మాటి మాటికి యేడ్చీ లాభంలేదు. యీ బాధల్నుంచి బయటపడే వొక మంచి మార్గమే తెలిస్తే నువ్విట్లా నన్ను హింసించవు. నేనిట్లా కంబడిపురుగులా బతకను."

సుభద్ర నోరెత్తలేదు.

"ఆంధ్ర పత్రిక" 7 యేప్రిల్ 1972.